
# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక




**December 1993**

# THE WORD OF TRUTH

# ఆహ్వానము

## కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

### 8వ గొప్ప బైబిల్ సెమినార్

ఉపన్యాసకులు : Bro. పెర్రి బి. కాతమ్, అమెరికా
Bro. జాన్ ఫోర్డ్, అమెరికా

తేదీలు : 1994 జనవరి 17 నుండి 21 వరకు
(సోమవారం నుండి శుక్రవారం వరకు)

సమయం : ప్రతి రోజు :
ఉదయం — 10 గం॥లు
మధ్యాహ్నం — 3 గం॥లు
సాయంత్రం — 6-30 గం॥లు

స్థలం : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఆవరణలో
విద్యుత్ నగర్ - మెయిన్ రోడ్,
సౌజన్య ఎంటర్ ప్రైజెస్ వెనుక
ఐడియల్ కాలేజి సమీపాన
కాకినాడ - 533 003.

గమనిక : సిటీబస్ 3, 5, 10 నెంబర్లు
విద్యుత్ నగర్ మెయిన్‌రోడ్ మీదుగా వెళ్ళును.

---

అన్ని సంఘముల బోధకులకు యిది ఒక ప్రత్యేక ఆహ్వానము. బోధింపబడుచున్న వాక్యము లేఖనానుసారముగా ఉన్నదో లేదో పరిశోధించుటకు మీకు ఇదొక గొప్ప సదవకాశము. ఉచిత భోజన, వసతి సౌకర్యము కలదు. మీరును, మీ మిత్రులును కలిసి రండి. మీకు మా ప్రత్యేక ఆహ్వానము.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor: J C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 డిశంబరు 1993 సంచిక 5


## సంపాదకీయము

### నేడే రక్షణ దినము

### (Today is the Day of Salvation)

నేడే రక్షణ దినమని బైబిలు బోధించుచున్నది. అయితే బాప్తిస్మమిచ్చుటకు కొందరు కనిపెట్టాలని చెబుతున్నారు. యిది వాక్యానుసారమైన బోధా? యని ఒక ప్రశ్నను మాకు వ్రాసారు.

"ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము. ఇదిగో ఇదే రక్షణ దినము" అని నిజానికి బైబిలు బోధించుచున్నది (2 కొరింథీ 6:2). ఇదే రక్షణ దినమనునప్పుడు, ఒకడు జీవించియున్న ఆ సమయమే, ఆ ఘడియయే యని మనం తలంచాలి. రక్షింపబడుటకు ఈ రోజే అనుకూల సమయం. తరువాత మనం మన రక్షణను నిర్లక్ష్యము చేయరాదని బైబిలు బోధించుచున్నది (హెబ్రీ 2:3). యేసు ప్రభువు తనను గూర్చి యిట్లు చెప్పుకొన్నారు. ఆ సూత్రము మనకు

కూడ వర్తించును: "పగలున్నంతవరకు నన్ను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను; రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పని చేయలేడు" (యోహాను 9:4).

ఒకడు పాపములోబడి నశింపోవుచున్నప్పుడు, నిరీక్షణ లేనప్పుడు, అతడు దేవుని గూర్చిన సత్యమును తెలిసికొని రక్షింపబడాలంటే యేమి చేయాలో తెలిసికొన్నప్పుడు తన రక్షణను గూర్చి అతడు ఎందుకు వాయిదా వేసుకోవాలి? ఏదైనా మంచిది దొరుకుచున్నట్లయితే దానిని గూర్చి ఎవడైనా కనిపెడతాడా? వెంటనే వెళ్లి దానిని పొందుతాడు గదా. ఒకడు దేవునియందు విశ్వాస ముంచాలి. ఆయన కుమారుడైన క్రీస్తునందు నేడే, ఇప్పుడే విశ్వాసముంచాలి (యోహాను 8:24). అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి. తనను నాశనము చేయుచున్న దానినుండి తొలగిపోవాలి. తన పరిస్థితియొక్క తీవ్రతను గ్రహించినవాడైతే అతడు ఆ పనిని ఈ రోజే చేయాలి (రోమా 6:23; అపొ.కా. 2:38). ఒకడు క్రీస్తునందు విశ్వాసియైతే ఆ విశ్వాసాన్ని ఒప్పుకొనుటకు మరొక దినం కొరకు ఎందుకు కనిపెట్టాలి? (మత్తయి 10:32, 33). ఆలాగే, ఒకనికి సువార్త బోధింపబడిన తరువాత, బాప్తిస్మమనగా పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడుట యని గ్రహించిన తరువాత, అతడు వెంటనే బాప్తిస్మము పొంది ప్రభువుకు తన విధేయతను సంపూర్ణము చేయుట మంచిది. గాని దానిని వాయిదా వేయకూడదు (మార్కు 16:16). ప్రభువుకు విధేయతచూపే సమయము ఇప్పుడు, ఈరోజు కాకపోతే ఇంకెప్పుడు? ఇంకో మాటలో ఒకడు ఈరోజే రక్షణ పొందగలిగినప్పుడు, పాపక్షమాపణ పొందగలిగినప్పుడు, దేవుని కుమారుడు కాగలిగినప్పుడు, క్రీస్తు సంఘ సభ్యుడు కాగలిగినప్పుడు, నిత్యజీవ

నిరీక్షణను పొందగలిగినప్పుడు, బాప్తిస్మము పొందుటకు ఎవడైనా ఎందుకు వాయిదా వేయాలి?

సత్యము బోధింపబడగా దానిని వినినవారు వెంటనే విధేయత చూపిన ఉదాహరణలు మనకు లేఖనములలో ఒకటి రెండు కనబడుచున్నవి. దానిని గూర్చి ఆలోచిస్తాము. బహుశా వచ్చే వారము, లేక నాకు ఖాళీయున్నప్పుడు అనే సాకులు వారు చెప్పలేదు. అపో. కా. 8వ అధ్యాయములో ఫిలిప్పు ఐతియోపీయ మనుష్యునికి సువార్త బోధించిన సంగతిని మనము చదువగలము. క్రీస్తునుగూర్చి అతడు వానికి బోధించెను. అంటే రక్షింపబడాలంటే యేమిచేయాలో అతడు వానికి బోధించెను. వారు అతని రథములో వెళ్లుచుండగా, నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు, నాకు బాప్తిస్మ మిచ్చుటకు ఆటంక మేమని అడిగెను. ఫిలిప్పు నీవు పూర్ణహృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను. నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను (అపో. కా. 8 : 36-39).

అపొస్తలుల కార్యములు 16వ అధ్యాయములో లూదియ, తన యింటివారు, ఫిలిప్పు చెరసాల అధిపతి, అతని యింటివారు మనకు కనబడుచున్నారు. అపో. కా. 16:15లో పౌలు లూదియకును, ఆమె యింటివారికిని సువార్త ప్రకటింపగా ఆమెయు ఆమె యింటివారును బాప్తిస్మము పొందిరని దైవ రికార్డు చెబుతున్నది. ఎప్పుడు? అప్పుడే! అట్లే పౌలు సీలాలు చెరసాల అధిపతికి అతని యింటివారందరికి దేవుని

వాక్యము బోధించిరి. రాత్రి ఆ ఘడియలోనే అతడు వారిని తీసికొని వచ్చి వారి గాయములు కడిగెను; వెంటనే అతడును అతని యింటి వారందరును బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:28-33).

లేఖనములలో సువార్తను విని, విశ్వసించి, బాప్తిస్మము పొందాలని కోరినవారికి వచ్చే వారము వరకు, లేక నెల వరకు లేక మరి కొంత కాలము కనిపెట్టాలని ఎక్కడా, ఎన్నడు చెప్పబడ లేదు. ఒకనికి సువార్త బోధింపబడినప్పుడు అతడు దానిని గ్రహించుకొన్నాడో లేదో మనం ప్రశ్నించి తెలిసికొనవచ్చును. అతనికి సరిగా బోధపడకపోయిన యెడల గ్రహించువరకు అతనికి ఉపదేశించుట అవుసరము. ఉపదేశ సారము గ్రహించినవాడు బాప్తిస్మము పొందగోరగా మనం వెంటనే అతనికి బాప్తిస్మ మియ్యాలి. రక్షింపబడగోరువాడు ఈ రోజే దేవునికి విధేయత చూపాలి. అనవసరంగా నిర్లక్ష్యం చేసినయెడల దేవుడు సంతోషించడు.

బాప్తిస్మము పొందుటకు కనిపెడితే కొంత కాలానికి ఆ వ్యక్తి తన అసక్తిని కోల్పోవచ్చును, లేదా అబద్ధ బోధకులు అతని మోస గించవచ్చును. లేదా అతడు మరణించవచ్చును. రక్షింపబడడానికి అంత దగ్గరకు వచ్చి దానిని కోల్పోతే ఎంత విచారము! గనుక ఏదో ఒక వీలైన సమయముకొరకు కనిపెట్టవద్దు. అది నిర్లక్ష్యం అవుతాది, చివరకు ఒకని నాశనానికి నడుపుతాది. ఇదిగో రేపు కాదు, ఈరోజే రక్షణ దినమని దయచేసి జ్ఞాపకముంచుకొనుము.

— o —

## యేసు చదువుకొనెనా ?

ఒక సహోదరి యేసు చదువుకొనెనా అని నన్ను ప్రశ్నించెను. 2 వేల సం॥ల క్రితమే ప్రభువు ఉన్న దినాల్లో యూదులమధ్య ఈ

ప్రశ్న ఉండెను. క్రీస్తు స్వదేశమందు సమాజ మందిరములో బోధిస్తున్నప్పుడు అనేకులు ఆయన బోధ విని ఆశ్చర్యపడి ఈ సంగతులు ఇతని కెక్కడనుండి వచ్చెను? ఈయన కియ్యబడిన జ్ఞాన మెట్టిది? (మార్కు 6 : 1-2), చదువుకొనని యితనికి ఈ పాండిత్య మెట్లు వచ్చెనని చెప్పుకొనిరి (యోహాను 7:14-15). ఆనాటి యూదుల సాంఘిక సమాజపు పరిస్థితులు మర్మంగా ఉన్నప్పటికిని యేసు మనుష్యుల దయయందును దేవుని దయయందును వర్ధిల్లుచుండెను (లూకా 2:52).

## గ్రంథము చదువుట

యేసు తాను పెరిగిన నజరేతులో వాడుక చొప్పున 7వ దినాన మందిరమునకెళ్ళి చదువుటకై నిలచి యెషయా గ్రంథము విప్పి (61వ అధ్యాయాన్ని) ప్రభువు ఆత్మ నామీద ఉన్నది, బీదలకు సువార్త ప్రకటించుటకై నన్నభిషేకించెను, చెరలోఉన్న వారికి విడుదలను అంధులకు దృష్టి కలుగునని ప్రకటించుటకు, నలిగినవారిని విడిపించుటకు ఆయన నన్ను పంపియున్నాడని వ్రాసినచోటు ఆయనకు దొరికెను. ఆ గ్రంథము చుట్టి పరిచారకుని కిచ్చి కూర్చుండెను. విన్నవారందరు యేసుని తేరి చూడగ మీమధ్య నేను చదివిన లేఖనము నెరవేరినదని చెప్పెను (లూకా 4:16-21).

## నేలమీద వ్రాయుట

యేసు బోధించుట కొచ్చినప్పుడు ఒక జార స్త్రీని తీసికొని వచ్చిన శాస్త్రులు పరిసయ్యులు బోధకుడా ధర్మశాస్త్రం రాళ్ళు రువ్వి చంపమంటుంది? అయితే నీవేమి చెప్పెదవని యేసును అడిగిరి. యేసు వంగి నేలమీద ఏమో వ్రాయుచుండెను. వారు పట్టువదలక అడుగుటచే మీలో పాపం లేనివాడు మొదట ఆమెమీద రాయి వేయవచ్చునని చెప్పి మరలా వంగి నేలమీద వ్రాయుటను వారు

చూచిరి. యేసు ఏమి వ్రాసెనో ఎవరికి తెలియదు. దైవావేశులును వివరించలేదు. నేలమీద వ్రాతను వ్యాఖ్యానించడం అర్థ రహితం (యోహాను 8:1-11).

## రూపాయిమీద వ్రాత

పరిసయ్యులు యేసును మాటల్లో చిక్కపర్చుట కాలోచించి రబ్బీ నీవు సత్యవంతుడవు ఎవన్ని లక్ష్యపెట్టక దేవుని మార్గాన్ని నిజంగా బోధిస్తు మోమాటము లేనివాడవని తెలుసు. నీకేమి తోచుచున్నది? కైసరునకు పన్నిచ్చుట న్యాయమా కాదా? మాతో చెప్పాలని అడుగుటకు హేరోదీయులతో తమ శిష్యుల నంపిరి. వారి చెడుతన మెరిగిన యేసు (యోహాను 2:24) పన్ను రూక ఒకటి నాకు చూపుడనెను. వారు ఒక దేనారము (అర్ధరూపాయి) ఆయన కిచ్చిరి. యేసు ఈ రూపమును పై వ్రాతయు ఎవరివని అడుగగా వారు కైసరువనిరి. అలాగైతే కైసరువి కైసరునకు, దేవునివి దేవునికే ఇవ్వండని చెప్పగా వారు ఆశ్చర్యపడిరి. కైసరు అనే వ్రాతను యేసు వారిచే చదివించినది గమనార్హమైనది (మత్తయి 22:15-22).

## క్రీస్తు దేవుని జ్ఞానము

మన ప్రభువు హెబ్రీ గ్రీకు అరామిక్ అను పురాతన భాషలలో మాట్లాడెను. ఆయన మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాట్లాడలేదు (యోహాను 7:32, 45-49). ఈ లోకజ్ఞానాన్ని వెర్రితనముగా జేసి పిలువబడినవారికే క్రీస్తు దేవుని శక్తియు దేవుని జ్ఞానమునై యున్నాడు (1 కొరి 1:20-24). యేసు నేలమీద వ్రాయుట గ్రంథము చదువుట దేనారపు వ్రాతను చదివించుట ఎంతటి ఆశ్చర్యము! ఎందుకంటే బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు క్రీస్తునందే గుప్తములై యున్నవి (కొలస్స 2:3).

— జి. ప్రకాశం, మద్రాసు.

# నిజం—నిష్ఠూరం

నిజము నిష్ఠూరమనునది లోకోక్తి. నిజమే పొరపాటునగాని నిర్లక్ష్యమువలనగాని ఎవరివలననైన ఘోర ప్రమాదము, అపారమైన నష్టము, తీరని దుఃఖముగాని సంభవించినచో వారిని నిందించి అదంతా వారివలననే జరిగెనని నిష్ఠూరంగా మాట్లాడుట సహజం. వివేకము గలవారైతే వారి తప్పిదము తెలుసుకొని మారుమనస్సు నొంది యికను అటువంటి పొరపాటు చేయకుండుటకు జాగ్రత్తపడుదురు. 'నిజం' లోని నిష్ఠూరత మనిషి మనసు నొప్పించగలదు; నొప్పించి ఒప్పించను గలదు.

సువార్తలోని నిజం :—దేవుడు ఉన్నాడనునది నిజం (ఆది 1:1; నిర్గమ 3:14; ప్రకటన 1:8). దేవుని లేఖనాలు నిజం (2 పేతురు 1:21; 2 తిమోతి 3 : 16, 17; 1 థెస్స 2 : 13). ఆ లేఖనాలు చెప్పు చున్న సువార్త నిజం. "...అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయ బడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథి 15 : 3, 4). ఈ సువార్తలో వాస్తవములు దాగియున్నవి. క్రీస్తు ఈలోకంలో జన్మించాడని (మత్తయి 2:1), మన పాపముల కొరకు చనిపోయెనని (1 తిమోతి 1:15; రోమా 5:8), మూడవ దిన మున లేచెనని (లూకా 24:7) తెలియజేయుచున్నది.

అవిధేయులు:—వివేకశూన్యు లందరు అవిధేయులే. సువార్త ప్రకటన సందర్భంగా మాట్లాడే తీరు మానవుల తప్పిదాలను ఎత్తి చూపి వారికి జ్ఞానోదయం కల్గించి రక్షణ మార్గములో నడిపించుటకే నిర్ణయింపబడినది. అయితే కొందరు వాటిని అపార్థము చేసుకొని ఘర్షణకు దిగుదురు. మానవుడు పాపియని (రోమా 3:23), విగ్రహా

రాధన కూడదని (నిర్గమ 20:4), అది వట్టిదని (1 కొరింథి 8:4), శరీర కార్యములు తప్పని (గలతి 5:19-21) బోధించుట కొందరు సహించలేరు. నిజమే దొంగను దొంగ యని, త్రాగుబోతును త్రాగుబోతని పాపిని పాపియని బాహాటంగా నిందిస్తే మనసు నొచ్చుకొనుట వాస్తవమే. పైగా వారు ఆగ్రహించి పోట్లాటకు సిద్ధపడుదురు. వీరంతా సువార్తలోని నిజానికి లోబడనివారు.

ఉదాహరణకు అపొస్తలుల కార్యములు 7వ అధ్యాయములోని ఒక సన్నివేశాన్ని జ్ఞాపకము చేసుకొందము. అక్కడ క్రీస్తు సేవకుడు స్తెఫను యూదులను సూటిగా చెప్పిపొడుస్తున్నాడు. క్రీస్తును యింకను రక్షకునిగా గుర్తించక ధర్మశాస్త్రాన్నే పట్టుకు వేలాడుతున్నందుకు అతడు వారిని నిందించాడు. వారి గత-చరిత్ర అబ్రాహాము మొదలు రాజుల కాలమునాటి పితరుల అతిక్రమములను అవిధేయతను ఎత్తిచూపించాడు. "ముష్కరులారా, హృదయమును చెవులను దేవుని వాక్యమునకు లోపరచనొల్లని వారలారా, మీ పితరులవలె మీరును ఎల్లప్పుడు పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నారు. . .ఆయనను (క్రీస్తును) మీరు యిప్పుడు అప్పగించి హత్య చేసినవారైతిరి. . ." (అ.కార్య. 7 : 51-53). ఈ నిష్ఠూరాన్ని వారు భరించలేక ఉగ్రులై స్తెఫనును రాళ్ళతో కొట్టి చంపిరి (అ.కార్య. 7:58).

అంతకు పూర్వము యేసుక్రీస్తు కూడ యూదుల మతాధికారులను మంచిమార్గమున పెట్టుటకు లేఖనములలోని సత్యాన్ని తెలియజెప్పి వారి తప్పిదాలను ఎత్తిచూపి సూటిగా విమర్శించి మాట్లాడుటచే వారి కోపానికి గురై సిలువకు అప్పగింపబడెను. మత్తయి సువార్త 23వ అధ్యాయము అంతటిలో వారిని నిందించిన విధము చదువగలము.

"అయ్యో! వేషధారులైన శాస్త్రిలారా, పరిసయ్యులారా,—

మీరు మనుష్యుల యెదుట పరలోకమును మూయుదురు. మీరందులో ప్రవేశింపరు, ప్రవేశించువారిని ప్రవేశింపనియ్యరు (23:14); "మీరు పుదీనాలోను సోపులోను జీలకఱ్ఱలోను పదియవవంతు చెల్లించి, ధర్మశాస్త్రములోని ప్రధాన విషయములను అనగా న్యాయమును కనికరమును విశ్వాసమును విడిచిపెట్టితిరి..." (23:23). "మీరు గిన్నెయు పళ్ళెమును వెలుపట శుద్ధి చేయుదురు గాని, అవి లోపల దోపుతోను అజితేంద్రియత్వముతోను నిండియున్నవి" (23:25). "మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని, లోపల చచ్చినవారి ఎముకలతోను సమస్త కల్మషముతోను నిండి యున్నవి" (23:27). "మీరు నీతిమంతులుగా కనబడుచున్నారు గాని లోపల వేషధారణతోను అక్రమముతోను నిండియున్నారు" (23:28). ఇలా ఎన్నో చెప్పి వారి నిజ స్వరూపాన్ని అతడు వెల్లడి చేసాడు. అట్లు విమర్శించుటలో వారు సత్యమును గ్రహించి వివేకముతో మార్పు చెందుదురని ఆయన యుద్దేశము. అయితే వారు మూర్ఖులు. వారి గుట్టు రట్టు అయినదని భావించిరి. ఆ నిజాలను నిందలుగానే వారు భావించిరి. అప్పుడు ధర్మశాస్త్రోపదేశకు డొకడు—బోధకుడా యీలాగు చెప్పి మమ్మును కూడ నిందించుచున్నావని..." (లూకా 11:45) యన్నాడు.

నిజానికి ఆనాడు యేసుక్రీస్తు బోధించినవి, స్తెఫను చెప్పినవి సత్యాలే. అయితే ఉన్న మాటంటే ఉలుకు; కాబట్టి వారు అందులోని నిజాన్ని గ్రహించక ఎదురు తిరిగి వారిని చంపి మరింత పాపాన్ని మూటగట్టుకొన్నారు. ఈనాడుకూడ లేఖనములలోని సత్యమును తెలిసికొనక వాటికి లోబడక అనేక మంది యింకను నశించిపోవుచున్నారు.

విధేయులు:-వివేకవంతులు సువార్తలోని నిజాన్ని ఆ నిజం

లోని నిష్ఠూరతను విని మనసున నొచ్చుకొని ఆలోచించి లోబడి మేలు నొందుదురు. నిజంలోని నిష్ఠూరత చాల శక్తివంతమయిన ఆయుధము. అది నాడు చాలా మందిని మార్చినది. నేడు కూడ మార్చుచున్నది. మొదటి శతాబ్దములో పెంతెకోస్తు దినమున క్రీస్తు సంఘ స్థాపనలో పేతురు ఉపదేశములో ఈ నిష్ఠూర వచనాలు ప్రముఖ పాత్రను వహించెను. అవేవన "ఇశ్రాయేలీయులారా, యీ మాటలు వినుడి... దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యద్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను (క్రీస్తును) మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి" (అ.కార్య. 2:22, 23). అనగా అక్కడ నిలచి వినుచున్న వారందరు చేసిన పాపములే ఆయనను బలిగొనెనని, కాబట్టి వారే ఆయనను చంపిరని వారి తప్పును వారికి జ్ఞాపకము చేసెను. అంతేకాక "మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" (అ.కార్య. 2:36). అట్లు పలుకుటచే వారి ఆలోచనలకు పదును పెట్టెను. అప్పుడు వారు నిజము గ్రహించి "ఈ మాట విని హృదయములో నొచ్చుకొని" (అ.కార్య. 2:37). వెంటనే బాప్తిస్మము నొంది రక్షింపబడి క్రీస్తు సంఘములో చేర్చబడిరి (అ.కార్య. 2:38-42).

దేవుని ఆజ్ఞలను తృణీకరించుటద్వారా క్రీస్తును మనము ఎట్లు హింసించుచున్నామో ఆయన ఎట్లు బాధింపబడుచున్నాడో యెషయా ప్రవక్త యిట్లు నిష్ఠూరము వేయుచున్నాడు: "మన యతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు దౌర్జన్యము నొందెను...అతడు నా జనుల అతిక్రమములను బట్టి మొత్తబడెను గదా..." (యెషయా 53:5-8). ఇటువంటి నేరమునే క్రీస్తు పూర్వము దూషకుడు హింసకుడు హానికరుడైన (1 తిమోతి

1:12) సౌలుపై మోపి అతనిని క్రైస్తవునిగా మార్చి గొప్ప సేవకునిగా తయారు చేసెను. యేసుక్రీస్తు యిట్లనుచున్నాడు : "సౌలా, సౌలా, నీవేల నన్ను హింసించుచున్నావు?..." "నేను నీవు హింసించుచున్న యేసును" (అ.కార్య. 9:4, 5). అప్పుడు సౌలు క్రీస్తు దేవుని కుమారుడని తెలుసుకొని, తాను క్రీస్తు సంఘ వినాశనానికై తలపెట్టిన హింసాయుత కార్యక్రమము లన్నియు తప్పని గ్రహించి మారుమనస్సు నొంది బాప్తిస్మము పొంది రక్షింపబడెను (అ.కార్య. 9:18). ఆ తరువాత క్రీస్తు సంఘ అభివృద్ధిలో ప్రముఖపాత్ర వహించి చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోయెను.

**విశ్వాస భ్రష్టులు:**-రక్షింపబడినవారు (క్రైస్తవులు) విశ్వాసమునుండి అప్పుడప్పుడు తొలగిపోయే ప్రమాదము గలదు (1 కొరింథి 10:12). అటువంటి వారిని గూర్చి కూడ పరిశుద్ధాత్ముడు నిష్ఠూరము వేయుచున్నాడు. "దేవుని దివ్య వాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయినవారు, తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువ వేయుచు, బాహాటముగా అవమానపరచు చున్నారు..." (హెబ్రీ 6:5, 6),

వీటన్నిటిని బట్టి చూస్తే దేవుని వాక్యము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును (2 తిమోతి 3 : 17) మాత్రమేగాక నిందించుటకును నిష్ఠూరంగా మాట్లాడుటకును ప్రయోజనకరమై యున్నట్లున్నది.

సువార్తలోని నిజాన్ని గ్రహించిన వారికందరికి పరిశుద్ధాత్ముడు యిచ్చు ఆజ్ఞ యిదే. "...మీరు మారుమనస్సు నొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అ.కార్య. 2:38).

—బి. సుధాకర్, కాకినాడ.

# ఒకసారి రక్షింపబడినవాడు ఎప్పటికి రక్షింపబడి ఉంటాడా ?

## ( Once Saved Always Saved ? )

ఈరోజుల్లో నిలిచియున్న అనేక మతశాఖలలో ఒకసారి రక్షింపబడినవాడు ఎల్లప్పుడు రక్షింపబడి యుంటాడు. అతని రక్షణ శాశ్వతం. తాను ఎట్టి పరిస్థితులలోను ఆ రక్షణ కోల్పోడు అను సిద్ధాంతం కలదు. మతశాఖలవారి అసంఖ్యాక తప్పుడు సిద్ధాంతాలలో ఇది ఒకటి. ఈ సిద్ధాంతము నమ్ముటవలన అనేకులు బుద్ధిపూర్వకంగా త్రాగుడు, అబద్ధములు, మోసము, కుట్ర మొదలగు పాపములను పదేపదే చేస్తున్నారు. కారణం ఏమిటి అంటే తమ రక్షణ శాశ్వతం అని అంటారు. ఈ విషయమై పరిశుద్ధ గ్రంథము ఏమి బోధిస్తుందో దైవభక్తి గల యదార్థవంతులు పరీక్షించుట ఎంతో అవుసరం. సత్యమును ప్రేమించువారు ఈ క్రింది వివరణ దైవ వాక్యంలో పరీక్షించ మనవి.

రక్షణ విషయమై యేసుక్రీస్తు చెప్పిన మాటలు మొదట గమనించండి. తరువాత అపొస్తలుల బోధను పరీక్షించుదము.

యేసుక్రీస్తు తన శిష్యులతో పరలోక రాజ్యములో ప్రవేశించుటను గూర్చి వివరిస్తూ చిన్నబిడ్డలవలె ఉండాలని చెబుతాడు. తరువాత - నీ చెయ్యిగాని, నీ కాలుగాని, నిన్ను అభ్యంతర పరచిన యెడల దానిని నరికి నీ యొద్దనుండి పారవేయుము; రెండు కన్నులు కలిగి అగ్నిగల నరకములో పడవేయబడుటకంటె ఒక కన్ను గలిగి జీవములో ప్రవేశించుట నీకు మేలు (మత్తయి 18 : 8-10). ఈ వాక్యములో పరలోకములో ప్రవేశించుట అంత సులువైన పనికాదు అని చూడగలము. రక్షింపబడినవారు పాపరహితమైన జీవితం జీవించాలను భావము ఈ వాక్యములో అగుపడుచున్నది.

# తప్పిదము చేసిన సహోదరుడు

తప్పిదము చేసిన వ్యక్తి విషయమై యేసుక్రీస్తు ఇలా అన్నాడు. "మరియు నీ సహోదరుడు నీయెడల తప్పిదము చేసిన యెడల నీవుపోయి, నీవును అతడును ఒంటరిగా నున్నప్పుడు అతనిని గద్దించుము. అతడు నీమాట వినినయెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి. అతడు వినని యెడల, ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతిమాట స్థిరపరచబడుని నట్లు నీవు ఒకరిద్దరిని వెంటబెట్టుకొని అతని యొద్దకు పొమ్ము. అతడు వారి మాటయు వినని యెడల ఆ సంగతి సంఘమునకు తెలియచెప్పుము; అతడు సంఘపు మాటయు వినని యెడల అతనిని నీకు అన్యునిగాను, సుంకరిగాను ఎంచుకొనుము" (మత్తయి 18:15-18). అన్యులును సుంకరులును దేవుని రాజ్యములో ప్రవేశించుదురా? పరలోక రాజ్యములో ప్రవేశించు అర్హత కోల్పోయిన వారి రక్షణ ఏమైనది ? "సంఘము" అను పదము యేసు ప్రభువు వినియోగించారు. ఆ మాటకు రక్షింపబడినవారి సమూహామని అర్థము. ఈ రక్షింపబడిన వ్యక్తి తప్పు చేసినప్పుడు అతనిని అన్యునిగాను, సుంకరిగాను, ఎంచుకొనుమని చెప్పి "భూమిమీద వీరారు వేటిని బంధింతురో, అవి పరలోకమందు బంధింపబడును అని నిశ్చయముగా చెప్పెను (వ॥ 18, 19). తప్పుచేసిన వానిని సంఘము అన్యునిగా ఎంచినప్పుడు, సంఘము వలన అతని పరలోక రాజ్య ప్రవేశము బంధింపబడుచున్నది.

పెండ్లి విందును గూర్చిన ఉపమానము: పెండ్లి వస్త్రము ధరించుకొనని ఒకని చూచి - "స్నేహితుడా, పెండ్లి వస్త్రము లేక ఇక్కడికేలాగు వచ్చితివని అడుగగా వాడు మౌనియై యుండెను. అంతట రాజు వీని కాళ్లు చేతులు కట్టి వెలపటి చీకటిలోనికి త్రోసివేయుడి; అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండునని పరిచారకు

లతో చెప్పెను (మత్తయి 22:11-13). ఈ ఉపమానము పరలోక రాజ్యమును సూచించుచున్నది. (వ 2). స్నేహితుడా అని యేసు ప్రభువు సంభోధించిన వ్యక్తి రక్షింపబడిన వాడని గ్రహించగలము. అతడు చీకటిలోనికి త్రోసివేయబడెను. ఈ చీకటి మరణానంతరము తీర్పు దినము వరకు అనీతిమంతులుండుస్థలము. ఇచ్చట ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును. అనగా యాతన ఉండును (లూకా 16:19-31, 2 పేతురు 2:4, యూదా: 6). యీ ఉపమానములో అతడు ఎందు చేత పెండ్లి వస్త్రము ధరించుకొనలేదో మనకు తెలియదుగాని పెండ్లి వస్త్రమనగా రక్షణ యని గ్రహించగలము (ప్రకటన 21:2, 22:14). కనుక అతడు రక్షణ నుండి తొలగిపోయి చీకటిలోనికి త్రోసివేయబడెను.

## అంతము వరకు సహించాలి

మత్తయి 24:12లో యేసుప్రభువు: "అంతము వరకు సహించు వాడెవడో వాడే రక్షింపబడు" అని చెప్పెను. అనగా అంతము వరకు సహించినవారు మాత్రమే రక్షింపబడుదురు మిగతావారు రక్షింపబడ రనునది ఈ వాక్య భావమని సులువుగా గ్రహించగలము. యేసు ప్రభువు ఈ మాట జనసమూహముతో కాదు తన శిష్యులతో చెప్పెననునది ప్రాముఖ్యంగా గుర్తుంచుకోవాలి (మత్తయి 24:1, 3). యేసు శిష్యులు రక్షింపబడినవారా? లేక రక్షింపబడనివారా? రక్షింప బడినవారి రక్షణ తమ క్రియల వలన కోల్పోయే అవకాశము ఎక్కువగా ఉన్నందున యేసు - అంతమువరకు సహించినవాడెవడో వాడే రక్షింపబడునని చెప్పెను. ఇంత స్పష్టంగా ఖచ్చితంగా యేసు బోధించినపుడు ఒకసారి రక్షింపబడితే, నీ రక్షణకు ఢోకాలేదు. నీవు ఎల్లప్పుడు రక్షింపబడి ఉంటావని మనుష్యులు బోధించుట దుర్బోధయే.

## మందలోని తోడేళ్లు

అపొస్తలుల బోధ గమనించండి : అపొ.కా. 20:28-31...ఈ వాక్యభాగములో "మంద" అనగా 'సంఘమని', సంఘమనగా రక్షింపబడినవారి సమూహామని గుర్తుంచుకోవాలి. "మరియు శిష్యులను తమ వెంట యీడ్చుకొని పోవలెనని వంకరమాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు. అనగా రక్షింపబడిన సమూహామునుండియే తమ రక్షణను విడిచి వంకరమాటలు పలికేవారు బయలుదేరుతారని కదా యీ వాక్య భావము. వీరిని కౄరమైన తోడేళ్ళని సంబోధిస్తాడు పౌలు. యీ తోడేళ్లు ఒకప్పుడు గొర్రెలు, ఒకే మందలోని వారు. ఎప్పుడైతే వారు తోడేళ్లుగా మారారో తక్షణమే వారు రక్షణ కోల్పోయారని కనీస జ్ఞానం కలిగిన వారుకూడా గ్రహించుదురు.

జాగ్రత్తగా ఉండమని పై వాక్యములో హెచ్చరించినట్లు అపొస్తలుడైన పౌలు తిమోతిని కూడా - నిన్ను గూర్చియు నీ బోధనుగూర్చియు జాగ్రత్తగా ఉండుమని హెచ్చరించాడు (1 తిమోతి 4 : 16). దొంగలున్నారు జాగ్రత్త అనగా మీ డబ్బులు వస్తువులు పోయే ప్రమాదం ఉందని కదా అర్థం. మందను గూర్చియు మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి అని అధ్యక్షులను హెచ్చరించాడు. ఏమిటి యీ వాక్య భావం? రక్షణ విలువైనదని అది వంకర మాటలవలన (తప్పుడు బోధల వలన) పోయే ప్రమాదం ఉంది కనుక జాగ్రత్త అని కదా? "భయముతోను, వణకుతోను మీ స్వంత రక్షణను కొనసాగించుకొనుడి" అని పౌలు ఫిలిప్పీయులకు వ్రాసాడు (ఫిలిప్పీ 2 : 12). రక్షణ శాశ్వతం, దానికి ఢోకా లేనిచో తమ స్వంత రక్షణ విషయం ఎందుకు భయపడాలి? ఎందుకు వణకాలి? అజాగ్రత్తగా ఉంటే రక్షణ పోతుందనేగా అలా వ్రాసాడు పౌలు.

హెబ్రీ పత్రిక గ్రంథకర్త మాటలు గమనించండి. సహోదరులారా జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్ట హృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి. మొదటినుండి మనకున్న దృఢ విశ్వాసము అంతము మట్టుకు గట్టిగా చేపట్టిన యెడలనే క్రీస్తులో పాలివారమై యుందుము (హెబ్రీ 3:12, 15). "ఆయనయొక్క విశ్రాంతిలో ప్రవేశించుదుమను వాగ్దానము ఇంక నిలిచియుండగా, మీలో ఎవడైనను ఒకవేళ ఆ వాగ్దానము పొందకుండ తప్పిపోవునేమో అని భయము కలిగియుందము (హెబ్రీ 4:1). ఈ వాక్యములు కూడా రక్షణ పోయే ప్రమాదం ఉంది కనుక జాగ్రత్త భయము వణకు కలిగి నడచుకోవాలని స్పష్టంగా బోధించుచున్నది.

చివరగా ప్రకటన గ్రంథములో యేసుప్రభువు యిలా అన్నారు. "మరణమువరకు నమ్మకముగా ఉండుము నేను నీకు జీవ కిరీట మిచ్చెదను" (ప్రకటన 2:10). రక్షణ అనగా పాపక్షమాపణ పొంది నిత్యజీవితంలో ప్రవేశించుటయే కదా? నిత్యజీవంలో ప్రవేశించుటకు మరణము వరకు రక్షణను కాపాడుకోవాలి. భయముతో, వణకుతో, మన స్వంత రక్షణ కొనసాగించుకోవాలి". "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మల యందును, దయ్యముల బోధయందును, లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" (1 తిమోతి 4:1, 2). విశ్వాస భ్రష్టులు కాక మునుపు వారు విశ్వాసులు అనగా రక్షింపబడినవారే కదా? దైవవాక్యం ఇంత స్పష్టంగా అనేక ఆధారాలతో సత్యమును బోధించుచుండగ తప్పుడు బోధలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

## ముగింపు

రక్షింపబడిన వారు నిష్కళంకంగాను, నిర్దోషంగాను, పాప రహిత పరిశుద్ధ జీవితం జీవిస్తూ ఉండాలని బైబిలులో అనేక హెచ్చరికలు కలవు వాటిని నిర్లక్ష్యంచేసి, బుద్ధిపూర్వకంగా, పాపము చేసిన యెడల న్యాయపు తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు, విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండును (హెబ్రీ 10:27). వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవజ్ఞానముచేత ఈ లోక మాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటిచేత జయింపబడిన యెడల వారి కడవరి స్థితి మొదటి స్థితి కంటె మరి చెడ్డదగును (2 పేతురు 2:20).

ప్రియ చదువరీ ! నీ స్థితి ఎలాగుంది? నీవు రక్షింపపడినావా లేనిచో ప్రభువు సువార్తకు విధేయుడవు కమ్ము. నీ రక్షణ విషయం జాగ్రత్త. నిర్లక్ష్యం నీకున్నచో రక్షణ పోయే ప్రమాదమున్నది కనుక భయముతోను, వణకుతోను, నీ స్వంత రక్షణను కొనసాగించుకొనుము. తప్పుడు బోధలున్న మనుష్యుల గుంపులు వదలి దైవ వాక్యమునకు ఏమియు కలుపకుండా, వాటిలోనుండి ఏమియు తీసివేయక ప్రభు వాక్యం ఉన్నది ఉన్నట్లుగానే బోధించే సంఘమునకు అనగా క్రీస్తే శిరస్సైయున్న సంఘములోకి రావలసిందిగా కోరుచున్నాను.

వి. జె. బెన్‌సన్, హైదరాబాదు.

—o—

## పరలోకము - రక్షింపబడిన వారి నిత్య గృహము

## ( Heaven, the Eternal Home of the Redeemed )

పరలోకము ఉన్నది. క్రీస్తుద్వారా ప్రతివాడు దానిలో ప్రవేశించవచ్చు అను గొప్ప నిరీక్షణను క్రైస్తవ్యము వలన మానవులు

కలిగి యున్నారు. పరలోక నిరీక్షణను బట్టి క్రైస్తవులు ఈ లోకములో ఒండొరుల భారములను భరింతురు. శోధనల నెదుర్కొందురు. ఈ లోకాశలను భక్తిహీనతను త్యజింతురు. రోగుల నాదరింతురు, ఆపదలలో యున్నవారిని ఆదుకొందురు, నిరుత్సాహ పడువారికి ప్రోత్సాహమిత్తురు. వీటన్నిటిని బట్టి క్రైస్తవులు ఈ లోకములో ఫలము నాశించరు గాని మోక్షము అను బహుమానము కొరకై నిరీక్షింతురు. నిజముగా క్రైస్తవ జీవితము జీవించదగిన జీవితమై యున్నది.

పరలోకపు సౌందర్యమును, దాని నిజస్థితిని మనము అర్థము చేసికొను నిమిత్తము వివిధ సంగతులతో అది మనకు బైబిలునందు పోల్చబడి యున్నది. ఆదాము హవ్వలు నివసించిన ఏదెను వనములో అది పోల్చబడి యున్నది. పాపము చేయుటవలన మానవులు ఆ వనములో నుండి తొలగించబడిరి. అయితే పాపమును జయించుట వలన వారు దానిలో పునః ప్రవేశించగలరు. "జయించు వానికి దేవుని పరదైసులో ఉన్న జీవ వృక్ష ఫలములు భుజింపనిత్తురు" అని ప్రకటన 2:7 లో ప్రభువు సెలవిచ్చుచున్నాడు. దేవుడు ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేసిన పాలు తేనెలు ప్రవహించు కానాను దేశము పరలోకమునకు సాదృశ్యముగా యున్నది. అట్లే దేవుని పట్టణమగు యెరూషలేము కూడ. అబ్రాహాముకూడ, "దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణకుడై యున్నాడో, పునాదులు గల ఆ పట్టణము కొరకు ఎదురు చూచుచుండెను" అని హెబ్రీ 11:10లో వ్రాయబడియున్నది. యూదుల ఆరాధన స్థలమగు దేవాలయములో అతి పరిశుద్ధ స్థలము పరలోకమునకు సాదృశ్యముగా నున్నది. "అందువలన నిజమైన పరిశుద్ధ స్థలమును పోలి హస్తకృతమైన పరిశుద్ధ స్థలములలో క్రీస్తు ప్రవేశింపలేదు గాని యిప్పుడు మనకొరకు దేవుని సముఖమందు కనబడుటకు పరలోకమందే ప్రవేశించెను" (హెబ్రీ 9 : 24). పర

లోకము దేవుడు ఏర్పరచిన విశ్రాంతిని సూచించుచున్నది. "కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది. ఏందుకనగా దేవుడు తన కార్యములను ముగించి విశ్రమించిన ప్రకారము ఆయనయొక్క విశ్రాంతిలో ప్రవేశించినవాడు కూడ తన కార్యములను ముగించి విశ్రమించును" అని హెబ్రీ 4:9, 10 లో వ్రాయబడి యున్నది.

## దేవునితో నివాసము

తండ్రియైన దేవుడు, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్ముడు, దేవదూతలు ఉండే ప్రదేశము పరలోకము. యేసుక్రీస్తు అక్కడనుండియే దిగివచ్చి మరల అక్కడికే తిరిగి వెళ్ళెను. ఆయన యిట్లనెను: "నాతండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను, నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14 : 2, 3). దీనిని బట్టి దేవుడు, దేవుని దూతలు ఉండే ప్రదేశమే కాకుండా పరిశుద్ధులు కూడ ఉండుటకు సిద్ధపరచబడిన ప్రదేశము పరలోకమని మనము గ్రహించుకొనగలము.

పరలోకము ఒక గొప్ప విలువగల బహు సౌందర్య పట్టణముగా కూడ బైబిలునందు వర్ణిపబడినది. "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడై యున్నాడో...ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురు చూచుచుండెను" (హెబ్రీ 11:10). దేవుడు తన పరిశుద్ధుల కొరకు ఒక పట్టణమును స్థిరపరచి యున్నాడు (హెబ్రీ 11 : 16). అది నూతన యెరూషలేమను పరిశుద్ధ పట్టణము (ప్రకటన 21:2). దానియందలి వెలుగు ధగధగ మెరయు సూర్యకాంతివంటి అమూల్య రత్నమును పోలియున్నది. ఆ పట్టణపు ప్రాకారము, దాని పునాదులు నానావిధ రత్నములతోను, సూర్యకాంతములతోను కట్టబడెను. దాని 12 గుమ్మ

ములు 12 ముత్యములు, పట్టణపు రాజవీధి శుద్ధ సువర్ణమయమై స్ఫటికమును పోలియున్నది. దానిలో ప్రకాశించుటకు సూర్యుడైనను, చంద్రుడైనను దానికక్కరలేదు. దేవుని మహిమయే దానిలో ప్రకాశించును. గొర్రెపిల్లయే దానికి దీపము అని భక్తుడైన యోహాను ఆ పరలోక సౌందర్యమును మన మెరిగిన భూలోక పదములతో ఆత్మావేశముచే వర్ణించెను (ప్రకటన 21:10-26). అది మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యమని అనగా దాని కెన్నడును అంతముండదని 2 పేతురు 1:11 లో వర్ణించబడినది.

## పాపములేని ప్రదేశము

పరలోకములో పాపముగాని, దుర్మార్గతగాని, దుష్టత్వముగాని, నిషిద్ధ మేదయిననుగాని యుంతదు. దుష్టులు, దుర్మార్గులు అందరు అగ్ని గంధకముతో మండు గుండములో పడవేయబడుదురు (ప్రకటన 21 : 18). నీతిమంతు లందరు పరలోకములో యుందురు. "గొర్రెపిల్ల జీవగ్రంథమందు వ్రాయబడినవారే దానిలో ప్రవేశింతురు గాని నిషిద్ధమైన దేదైనను, అసహ్యమైన దానిని, అబద్ధమైన దానిని జరిగించు వాడైనను దానిలోనికి ప్రవేశింపరు" (ప్రకటన 21 : 7). "ఇకమీదట శాపగ్రస్తమైన దేదియు దానిలో ఉండదు. దేవుని యొక్కయు, గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో ఉండును" (ప్రకటన 22 : 3). అందువలన పరలోకము క్రొత్త ఆకాశము, క్రొత్తభూమి యని చెప్పబడెను. దానిలో నీతి నివసించును (ప్రకటన 21:1, 2 పేతురు 3:13).

పరలోకములో పరిశుద్ధత నివసించును. అందున్న వారి హృదయములలోగాని, జీవితములోగాని పాపము ఏమాత్రమును ఉండనేరదు (1 కొరింధి 1 : 8, యూదా :24). పరలోకమందున్న నిత్యము వారు

జీవింతురు. ఆ నిత్యజీవము ఇప్పుడున్న ఈ జీవితముకంటె బహు శ్రేష్ఠమైనది, ఉత్కృష్టమైనది, అది అంతులేనిది. అందువలననే "మరణము వరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవకిరీట మిచ్చెదను" అను వాగ్దానమును ఆయన మనకు చేసెను (ప్రకటన 2:10, 1 యోహాను 2 : 25).

పరలోకమందు సుఖము, శాంతి, విశ్రాంతి లభించును. బీదవాడైన లాజరు చనిపోయి, అబ్రాహాము రొమ్మున ఆనుకొని నెమ్మది పొందుచున్నట్లు లూకా 16 : 25 లో వ్రాయబడినది. ప్రభువునందు మృతి నొందువారు ధన్యులు, వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు; వారి క్రియలు వారి వెంట పోవునని పరిశుద్ధాత్మ డు ప్రకటన 14:13 లో చెప్పియున్నాడు.

పాపము, దానిద్వారా కలుగు శాపము ఏమియు పరలోకమందు ఉండదు. అక్కడ "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచి వేయును. మరణము ఇక ఉండదు. దుఃఖమైనను ఏడ్పైనను, వేదనయైనను ఇక ఉండదు" (ప్రకటన 21:4). మరణము, దుఃఖము, ఏడ్పు, వేదన ఇవన్నియు ఎందువలన వచ్చెను? అవన్నియు పాపము వలన సంభవించెను. పాపము నాశనము చేయబడి, దానినుండి విమోచన సంపాదించబడిన తరువాత పాపపు శాపముకూడ నాశనము చేయబడును. పాపముయొక్క ప్రభావము ఇసుమంతయుకూడ లేని ఆ ప్రదేశమందు నిత్యము జీవించగలుగుట యెంత గొప్ప భాగ్యము!

## నిత్యానందము

ఏదేను వనములో యుండునట్టి ప్రశాంతత పరలోకములో యుండును. జీవజలనది పరలోకమందలి రాజవీధి మధ్య ప్రవహించును. ఆ నదియొక్క ఈవలను, ఆవలను జీవవృక్ష ముండును; శాపగ్రస్తమైన దేదియు దానిలో ఉండదు అని ప్రకటన 22:1-3 లో వ్రాయబడి యున్నది.

పరలోకము అత్యానంద భరిత ప్రదేశమని మనకు యేసుక్రీస్తు హామీ నిచ్చెను. ప్రభువు తన కిచ్చిన తలాంతులను ఆయన మహిమ కొరకు వినియోగించిన ప్రతివానిని ఆయన చూచి, "భళా నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటిమీద నియమించెదను, నీ యజమానుని సంతోషములో పాలు పొందుమని" చెప్పారు (మత్తయి 25:21).

పరలోకమందున్న వారు ప్రభువును ఎల్లప్పుడు స్తుతించెదరు. ఏలయనగా మహిమాప్రభావములు ఆయనకే చెందును (ప్రకటన 19:1). వారు దేవుని సింహాసనము ఎదుటనుండి రాత్రింబగళ్లు ఆయనను సేవించుదురు (ప్రకటన 7:15).

పరలోకములో ఎవరెవరు ఉందురు? అను ప్రశ్నకు ప్రకటన 22:3, 4లో ఇట్లు వ్రాయబడి యున్నది: "దేవుని యొక్కయు, గొఱ్ఱెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో నుండును; ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖ దర్శనము చేయుచుందురు; ఆయన నామము వారి నొసళ్ళ యందుండును". అంతే గాక దేవునికి నమ్మకముగా జీవించిన గోత్రకర్తలు అక్కడ యుందురు: "అనేకులు తూర్పు నుండియు పడమటనుండియు వచ్చి అబ్రాహాముతో కూడను, ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను పరలోక రాజ్యమందు కూర్చుందురు" అని మత్తయి 8:11 లో యేసు చెప్పెను. మరియు గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథములో వ్రాయబడిన పేర్లుగలవారు పరలోకములో యుందురు (ప్రక. 21:27). అట్టివారు జీవవృక్షమునకు హక్కుగలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను క్రీస్తుయొక్క రక్తములో ఉదుకుకొనినవారై యుందురు (ప్రక. 22:14).

పరలోకము యొక్క గంభీరతను, సౌందర్యమును, ఘనతను

వర్ణించుట నాకు గాని మరి యే మానవునికి గాని సరిపడదు. మనలో ఎవడును నశింపకుండ అందరును పరలోకమునకు వెళ్ళునట్లు యేసు క్రీస్తు మనందరికొరకు సిలువపై మృతి పొందెను. ఆయనయందు విశ్వాసముంచి, మన పాపములను విసర్జించి, పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తునామములోనికి ఇప్పుడు మనము బాప్తిస్మము పొందిన యెడల ఆయన మనలను తప్పక రక్షించును. అంతేగాకుండ మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల ఆ పరలోక రాజ్యములో మనలను ఆయన తప్పక చేర్చుకొనును. నీవు పరలోకమునకు వెళ్ళుటకు ఆశించుచున్నావా ?

—జాషువా గూటం.

— o —

## నాలుకను అదుపులో యుంచుట

### ( Taming the Tongue )

ఉద్యోగరీత్యా కొందరు జీవన్మరణాయుధములను తమతో ఎల్లప్పుడు మోసుకొని వెళ్తారు. ఉదాహరణకు పోలీసులు మారణాయుధములను, వైద్యులు ప్రాణాన్ని రక్షించే శక్తివంతమైన ఔషధములను తమతో తీసికొని వెళ్తారు. అట్టివారిపై యున్న బాధ్యత గొప్పది. అట్టి శక్తివంతమైన పరికరాలను బుద్ధిహీనులకు, అజాగ్రత్తపరులకు అప్పగింపకూడదు.

జీవనమరణములు నాలుకవశమని బైబిలు బోధించుచున్నది (సామె 18 : 21). నాలుక గొప్ప మేలు చేయగలదు. "సాత్వికమైన నాలుక జీవవృక్షము.. సమయోచితమైన మాట యెంత మనోహరము!" (సామె 15 : 4, 23). అయితే అది గొప్ప కీడునుకూడ చేయగలదు. "నా నాలుకతో పాపము చేయకుండునట్లు నా మార్గములను జాగ్రత్తగా చూచుకొందును. భక్తిహీనులు నా యెదుటనున్న

ప్పుడు నా నోటికి చిక్కము ఉంచుకొందును" అని దావీదు చెప్పెను (కీర్త 39 : 1).

మనలో ప్రతివాడు ఈ శక్తివంతమైన ఆయుధమును మనతో కూడ మోసికొని వెళ్లుచున్నాము. సమయోచితమైన మాటవలన బలహీనులు బలపడుదురు, తొట్రిల్లువారు సరియగుదురు. అది జీవము నియ్యగలదు! కపటమైన నాలుక జీవితాలను నాశనం చేయును. చంపుటకు నిజముగా దానికి శక్తి యున్నది. మనం మాట్లాడునప్పుడు అందుకే జాగ్రత్తగా మాట్లాడాలి. సరియైన పదముల నుపయోగించాలి. పోలీసులు మారణాయుధములను ధరించినప్పుడు ఎంత జాగ్రత్తగా యుంటారో క్రైస్తవులు కూడ తమ నాలుకను గూర్చి అం జాగ్రత్తగా యుండాలి.

అదుపులో లేని నాలుకవలన కలుగు ప్రమాదము గొప్పది. అట్టిది అగ్నివంటిది. "నాలుక కూడ చిన్న అవయవమైనను బహుగా అదిరి పడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగుల బెట్టును! నాలుక అగ్నియే. నాలుక మన అవయవములలో ఉంచ బడిన పాపప్రపంచమై సర్వ శరీరమునకు మాలిన్యము కలుగజేయుచు ప్రకృతి చక్రమునకు చిచ్చు పెట్టును; అది నరకముచేత చిచ్చు పెట్ట బడును" (యాకోబు 3:5, 6).

ఆదివారపు ఉదయమున దేవుని పేరిట స్తోత్రము చేసి, తన పొరుగువానిని మిగతా వారము దినములన్నియు శపించుచున్న యెడల అట్టివాని ఆత్మ ప్రమాదకు స్థితిలో యున్నది (యాకో 3 : 9). యిది అసంగతము. గాని అనేక క్రైస్తవులకు ఈ అలవాటున్నది. క్రైస్తవులు సువార్త సత్యములను పైకెత్తుటయేగాక, ఈ లోకానికి ప్రకాశమానమైన దీపముల వంటివారు. సువార్తకు ఆటంకము సంభవించకుండు నిమిత్తము మ నాలుకను అదుపులో యుంచుకొందుము గాక!

—హోల్జర్ న్యూబర్ (W.E.).

# సంక్షిప్త వార్తలు

నవంబరు నెల సువార్తికుల సదస్సు మరియు సువార్త కూటము 24వ తేదీన పాలకొల్లు క్రిష్టియన్ పేటలో క్షేమాభివృద్ధికరంగా జరిగెను. క్రీస్తు రాజ్యవ్యాప్తి నిమిత్తమై దివారాత్రులు శ్రమించుచున్న వందలాది సువార్తికుల సమక్షంలో "రక్షింపబడాలంటే క్రీస్తు సంఘములో యుండుట అవసరమా?" అను ప్రాముఖ్యమైన అంశము చర్చింపబడెను. రేటఫ్రన్ సంఘ పెద్దలు జె.బి. ట్రోటర్‌గారు ఈ చర్చలో పాల్గొనుట విశేషం.

ఉదయకాల సమావేశానికి సోదరులు T.Ch. ఫ్లెమింగ్స్‌గారు అధ్యక్షులుగా నుండగా సోదరులు U. స్టాలిన్, కె. ప్రసాద్, వి. చిన్నయ్య, పి. సామ్యూల్, ఆర్. స్టీవెన్‌సన్, పాల్ గూటం మరియు యస్. ఎబినెజరుగార్లు చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమయంలో 25 మంది బాప్తిస్మము పొందిరి. మధ్యాహ్న సమావేశమునకు సోదరులు పాల్ గూటం అధ్యక్షత వహించిరి. సోదరులు పి. ప్రకాశం, ఐ.జె. జయానందం, ఇ.కె.వి. ప్రసాదరావు, వాసా ప్రసాదరావు, బి. యోహాను మరియు జె.బి. ట్రోటర్‌గార్లు అంశమును చర్చించిరి.

'సంఘము' అను పదమునకు పిలువబడినవారు అని అర్థము (1 కొరింథి 1 : 1-2). జగత్తు పునాది వేయబడకముందే దేవుని నిత్య సంకల్పములో సంఘమును గూర్చిన ఏర్పాటు ఉండుటవలనను, క్రీస్తు దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనుట వలనను సంఘము ప్రాముఖ్యమైనది (ఎఫె 1 : 4 5:25). దానియొక్క శిరస్సును బట్టియు, క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు దేవుడు మహిమపరచబడవలె నను సంకల్పమును బట్టియు సంఘము ప్రాముఖ్యమైనది. సంఘము ప్రాముఖ్యము కాదని చెప్పువారు బైబిలు అధికారమును నిరాకరించువారు. రక్షింపబడినవారు సంఘము (అ.కా. 2:47). సంఘములో ఎవరైతే లేరో వారు రక్షింపబడ లేదు. అంటే క్రీస్తుసంఘములో లేకుండ ఎవరూ రక్షింపబడ లేరు. నమ్మి బాప్తిస్మము పొందినవారు రక్షింపబడుదురు. రక్షింపబడినవారు సంఘములో మరణము వరకు నమ్మకముగా నుండి ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలసిన బాధ్యతను కలిగియున్నారు.

శిరస్సు, శరీరము వేరై యుండవు. అట్లే క్రీస్తు, సంఘము వేరుగా లేదనునది సత్యము. మతశాఖలు తండ్రి నాటని మొక్కలు. ఒకడు రక్షింపబడాలంటే క్రీస్తు సంఘములో ఉండాలని హెచ్చరించిరి. పాపి రక్షింపబడాలి, అతనికి నిత్యజీవము కావాలి. అయితే అతడేంచేయాలి? క్రీస్తులోనికి అతడు ప్రవేశించాలంటే (రోమా 6:3), బాప్తిస్మము పొందాలి. క్రీస్తులో ఉండాలంటే ఆయన శరీరములో ఉండాలి (కొలస్స 1 : 18). సంఘము, రక్షణ వీటికి ఎట్టి సంబంధము లేదని ఎవరైనను బోధిస్తే వారు క్రీస్తు బోధకు విరోధులు.

సోదరులు జె.బి. ట్రోటర్‌గారు మన ప్రాంతములలో జరుగుచున్న పనిని పరిశంసించి అనేక ప్రోత్సాహకరమైన మాటలతో సోదరుల హృదయాలకు ఆదరణ కలిగించిరి. సోదరుల యెడల వారి పని విషయమై తమ ప్రేమను చక్కని పదాలతో వ్యక్తపరచిరి. సంఘ క్షేమాభివృద్ధికి అవసరమైన హెచ్చరికలు యిచ్చిరి. పాలకొల్లు క్రిష్టియన్ పేటలోను పరిసర ప్రాంతములలోను సోదరులు జి. షడ్రక్‌గారు మంచి పని చేయుచున్నారు.

---

Regd. No. H/KD—45/KD H.O

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
............................................
............................................
............................................
............................................